

వన్యప్రాణుల అలజడి



- జనావాసాల్లోకి వచ్చి మనుషులపై దాడి
- రెండేళ్లలో జిల్లాలో ఐదుగురు మృత్యువాత
- ఇటీవల కాలంలో మారుమూల గ్రామాల్లో సంచరిస్తున్న పులులు
- భయాందోళనలో ప్రజలు

సిర్పూర్(టి), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండేళ్ల కాలంలో వన్యప్రాణులు అలజడి రేపాయి. ఇటీవల కాలంలో జనావాసాల్లోకి ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు వచ్చి దాడులు చేస్తున్న సంఘటనల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో వన్యప్రాణులు ఆందోళన కలిగిస్తున్నాయి. జనావాసాల్లోకి చేరి దాడులు చేయడంతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. తాజాగా సిర్పూర్(టి) అటవీ ప్రాంతంలో జరిగిన ఘటనలో భార్యభర్తలు మృతి చెందిన సంఘటన సంచలనం కలిగించింది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోఅడవులు విస్తారంగా ఉన్నాయి. మహారాష్ట్ర అటవీ ప్రాంతం ఆనుకొని ఉంటుంది. ప్రాణహిత, పెద్దవాగు పరివాహక ప్రాంతాలలో దట్టమైన అడవులు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో అడవులను ఆనుకునే గ్రామాలు, జనావాస ప్రాంతాలు ఉన్నాయి. అటవీ డివిజన్‌లో గతంలో నమోదైన ఘటనల దృష్ట్యా పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఏటా అటవీ శాఖ నిర్వహి స్తున్న వన్యమృగాల గణనలో అధికారికంగా నమోదు వుతున్నాయి.

నమోదవుతున్న పులి కదలికలు..

కాగజ్‌నగర్, సిర్పూర్(టి), పెంచికలపేట, బెజ్జూరు మండలాల్లో ఏటా పులి కదలికలు నమోదవుతున్నాయి. అటవీ ప్రాంతాన్ని దాటి జనా వాసాలపై దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆందో ళనకు గురవు తున్నారు. పులుల దాడులకు పాల్పడ్డ ఆయా మండలాల్లో వాటి ఆచూకీ కనిపెట్టడంలో అధికారులు విఫలం కాగా ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. వారాల తరబడి వ్యవ సాయ భూముల్లో పనులు నిలిచి పోయా యి. ఇటీవల సిర్పూర్(టి) మండలంలోని భీమన్న ఆలయ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో పశువుల కాపర్లుగా పని చేసే దంపతుల మృతదేహాలు లభించడం కలక లం రేపింది. వారి మృతి పట్ల భిన్నా భిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఘటన స్థలం కాగజ్‌ణగర్ నుంచి సిర్పూర్(టి)కి వెళ్లే ప్రధాన రహదారికి, జన సంచారం ఉండే భీమన్న అలయాల పరిసరాలకు సమీపంలోనే ఉండడం గమనార్హం. మృతి చెందిన వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు పరామర్శించారు. ఇద్దరు ఎలుగుబంటి దాడిలోనే మృతి చెందారనే అనుమానాలను వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటా మని భరోసా ఇచ్చారు.

కానీ అటవీ శాఖాధికారులు మాత్రం ఈ ఘటనపై పూర్తి స్పష్టతన్వివక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చినా వాటి కదిలికలను గుర్తించడంలో అటవీ శాఖాధికారులు విఫలమవుతున్నారని చెబుతున్నారు. ఈ కారణంగానే దాడులు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో ఉండే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్య వైఖరిపై బహిరంగంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తొలిసారిగా ఏనుగు రాక..



జిల్లా చరిత్రలోనే తొలగిసారిగా ఓ ఏనుగు జిల్లాకు వచ్చింది. మూడు రోజుల పాటు సంచరిస్తూ అలజడి రేపింది. ఇద్దరిపై దాడి చేసి చంపేసింది. గతేడాది ఏప్రిల్‌లో ఏనుగు దాడిలో చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లిలో అల్లూరి శంకర్, పెంచికలపేట మండలం కొండపల్లి వద్ద కారు పోశన్నలపై దాడి చేయగా మృతి చెందారు. దీంతో స్థానికులు చేలలోకి వెళ్లాలంటేనే భయాందోళన చెందిన పరిస్థితి నెలకొంది. రెండేళ్లలో పులుల దాడుల్లో కాగజ్‌నగర్, పెంచికల పేట, బెజ్జూరు మండలాలకు చెందిన ముగ్గురు మృతి చెందగా మరికొందరికి గాయాలు అయ్యాయి. పులుల దాడుల్లో ఏటా పశువులు మృత్యువాత పడడం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలోనూ పశువులు మృతి చెందిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చేలల్లోకి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

హైకోర్టు తీర్పుతో స్థానిక ఎన్నికలకు బ్రేక్

అయోమయంలో ఆశావహులు

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్న వేళ హైకోర్టు తీర్పుతో ఎన్నికలకు బ్రేక్ పడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు గురువారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేయగా దీనికి తగట్టు జిల్లాలోని అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి విడత పరిషత్ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేశారు. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించగా తొలి రోజు ఎంపీటీసీ స్థానాలకు 8 నామినేషన్లు, జడ్పీటీసీ స్థానానికి 1 నామినేషన్ కూడా దాఖలు అయ్యాయి. జీవో నెం.9పై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచి పోయింది.

మొదటి విడతలో..

జిల్లాలో 15 జడ్పీటీసీ, 127 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొదటి విడతలో సిర్పూర్ నియోజకవర్గంలో 7 మండలాలతో పాటు ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని రెబ్బెన మండలంను కలుపుకుని మొత్తం 8 మండలాల్లోని 8 జడ్పీటీసీ స్థానాలకు, 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మే రకు అధికారులు గురువారం ఉదయం 10.30 గంటల నుంచి ఆయా ఎంపీడీవో కార్యాల యాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించింది. మొదటి రోజు 8 మండలాల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు 8, జడ్పీటీసీ స్థానానికి 1 నామినేషన్ దాఖలయ్యాయి. హైకోర్టు తీర్పుతో ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచి పోవాల్సి వచ్చింది. కాగా కొంత కాలంగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురు చూస్తున్న ఆశావవహులు హైకోర్టు తీర్పుతో అయోమయంలో పడ్డారు. ఎన్నికల బరిలో నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న ఆశావాహులకు కోర్టు తీర్పుతో తాత్కాలికంగా మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. దీంతో మరికొన్ని రోజులు పోటీదారులపై అదనపు భారం పడే అవకాశం లేక పోలేదు.

నామినేషన్లు దాఖలు

కాగజ్‌నగర్/సిర్పూర్(టి)/చింతలమానేపల్లి/కౌటాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పలువురు నామినేషన్లల దాఖలు చేశారు. కాగజ్‌నగర్ మండలంలోని ఆయా మండలాల నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీలకు నామినేషన్లు దాఖాలు చేసేందుకు అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగజ్‌నగర్ భట్టుపల్లి ఎంపీటీసీ స్థానానికి ఒక నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు ఎంపీడీవో వాసు తెలిపారు. సిర్పూర్(టి) మండలంలో మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మండలంలోని డోర్‌పల్లి ఎంపీటీసీ స్థానికి గాను జాడె కోటేశ్వర్, జాడె గౌతమిలు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎన్నికల్లో భాగంగా గురువారం ఎంపీటీసీ స్థానాలకు రెండు, జడ్పీటీసీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి దీపక్ తివారి సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌటాల మండలంలోని కౌటాల ఎంపీటీసీ స్థానికి మొదటి రోజు ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బట్టమేకల గట్టయ్య తన నామినేషన్‌ను దాఖలు చేశారు.

పరిశీలించి..సూచనలు చేసి..



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి దీపక్ తివారి

సిర్పూర్(టి), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలను గురువారం జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ ఉన్నారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన

పెంచికలపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా గురువారం సందర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వహిదుద్దీన్, తహసీల్దార్ తిరుపతి, ఎస్సై అనీల్‌కుమార్, ఎంపీడీవో అల్బర్ట్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. సిర్పూర్ (టి) మండలంలోని వేంపల్లి గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. లోన్‌వెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నవత ఆధ్వర్యంలో 60 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో తూడూరు దత్తాత్రేయ, లెక్చరర్లు జనార్దన్, మహేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించి.. సౌకర్యాలు తెలుసుకొని..

బెజ్జూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ టీం సభ్యులు సందర్శించి సౌకర్యాలు తెలుసుకున్నారు. టీం సభ్యుడు డాక్టర్ సందేశ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ముందు ల గది, సిబ్బంది వివరాలు, వైద్య సేవలు తదితర వాటిపై అడిగి తెలు సుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు ఏ విధం గా చేపడుతున్నారు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, రోగులు ఎంత మందికి వైద్య సేవలు అంతున్నాయి తదితర వాటిపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న నమసమస్యలపై ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట టీం లీడర్లు డాక్టర్ రవితేజ, లోకేష్, చందు, ఆశీష్ కపూర్, సూపర్‌వైజర్ శారద, హెల్త్ అసిస్టెంట్ వెంకన్న, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సభ్యులు

పాఠశాల పరిశీలన

కౌటాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయనగరం పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి గురువారం పరిశీలించారు. సిర్పూర్(టి) సోషల్ వెల్ఫేర్ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో అక్కడి విద్యార్థులను వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమకు అందుబాటులో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన జరిగేలా చూడాలని ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు మండలంలోని విజయనగరం గ్రామంలో గతంలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పాఠశాలలో గదుల వివరాలు, మూత్రశాలలు, స్నానపు గదులు, వంట గది, స్టోర్ రూం, డైనింగ్ హాల్ తదిత రాలను పరిశీలించారు. అనంతర గ్రామ కమిటీ సభ్యులతో మాట్లాడారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రామ కమిటీ సభ్యులు రావాలని అధికారులకు సూచించారు. వారి వెంట తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



శివకుమార్‌ను సన్మానిస్తున్న సంక్షేమాధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎం శివకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ వసతి గృహ సంక్షేమాధకారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంలో అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు మధుకర్, ప్రసాద్, కృష్ణప్రసాద్, తిరుపతి, భాగ్యారాణి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీసీడీడీ శివకుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, లక్ష్మి, శారద, పార్వతి, సరోజ, జ్యోతి, పోశక్క తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



జైనూర్ ఆశ్రమ పాఠశాలలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

జైనూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని గురువారం పీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో పాఠశాల రికార్డులను తరగతి గదులను పరిశీలించారు. పీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. విద్యా రంగం బలోపేతం దిశగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఆవసరమైన సదుపాయాలు కల్పించి మెరుగైన విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా విద్యార్థులకు డెంగీ, మలేరియా, వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహల పరిసర ప్రాంతంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. చెత్తాచెదారం నిత్యం తొలగించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంట శాలలు, మూత్ర శాలలు పరిశుభ్రంగా ఉండేల చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా ఉపాధ్యాయులు వారితో సాధన చేయించేందుకు కృషి చేయాలని సూచిచారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్, వెంకన్న, హెచ్ఎం పార్వతీబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి

వాంకిడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని జైత్పూర్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి బహుజన సమాజాన్ని నిర్మిం చాలని ప్రయత్నం చేశారని అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. అనం తరం బస్టాండులో ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, దుర్గాజీ, జయరాం, రోషన్, శ్యాంరావు, రాజేశ్వర్, శ్యాంరావు, విఠల్ పాల్గొన్నారు.



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు

కెరమెరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంలోని కేస్లాగూడ రైతు వేదికలో ఎన్నికల ప్రొసిడింగ్ అధికారులకు ఒక రోజు శిక్షణ తరగతులను డీఎల్‌పీవో ఉమర్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు ప్రిసెడింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఎంపీడీఓ ఖాజా అజీజుద్దీన్ ఆధ్వర్యంలో శిక్షకులు చైతన్య శిక్షణ ఇచ్చారు. పీవో, ఏపీవోలకు సంబంధించిన విధి నిర్వహణలో భాగంగా వచ్చే సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పీవో, ఏపీవోలుగా ఎంపికైన వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లు సజావుగా చేపట్టాలి



మాట్లాడుతున్న అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ రఘురామ్

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం టెండర్లు సజావుగా చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ రఘురామ్ అధికారులకు సూచించారు. నూతన మద్యం టెండర్ల ప్రక్రియలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆబ్కారీ శాఖ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా మద్యం టెండర్లలో దరఖాస్తుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ నెల 18న దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ నేపథ్యంలో ఈ నెల 11న రెండో శనివారం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి జ్యోతికిరణ్, సీఐలు రవి, రమేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. కాగా జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. అక్టోబరు 9 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 34 మంది దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ గురువారం తెలపారు. జిలాలో 32 దుకాణాలకు ఈ నెల 18 వరకు ప్రభుత్వం దరఖాస్తు గడువు విధించిందని, డిసెంబరు 1న దుకాణాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

తిర్యాణి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి బెల్లంపల్లి వైపు అక్రమంగా ఆటోలో కలపను తరలిస్తుండగా గురువారం అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆత్రం ధర్మానాథ్ టమాటాలో అక్రమంగా కలప తరలిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేశామని అన్నారు. నాలుగు టేకు దుంగలు లభించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.18 వేలు ఉంటుందని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్‌వో వెంకటరాం, ఎఫ్‌బీవో ప్రేంసింగ్, వాచర్ రవీందర్, రాజేష్, శ్రీకాంత్, రమేష్, వికాస్, దొండె రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధిని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డి జాగృతి సభ్యులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా ఎప్పటికైనా బీసీ రాజ్యాధికారాన్ని సాధించి తీరుతామని అన్నారు. బీసీలను ఐక్యం చేసి ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ఆందోళనకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు మారుతి, తిరుపతి, కమలాకర్, హనుమంతు, సదాశివ్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

దారి ఇలా.. వెళ్లేది ఎలా?

- ఆసుపత్రి రోడ్డు బురదమయం
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్య సిబ్బంది
- పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, రోగులను మరో కష్టం పీడిస్తోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ అంతా గుంత లు, బురదమయంగా మారింది. దీంతో రోగులు, ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రి నిర్మించి నప్పటికీ ఆసుపత్రి ఎదుట ఉండే రోడ్డు, ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు వర్షపు మడుగు అడ్డంకిగా మారాయి. నిత్యం వందలాది ప్రజలు, రోగులు, సిబ్బంది వచ్చిపోయే ఏరియా ఆసుపత్రికి దారి లేపో వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సంవత్సరం వర్షకాలం ఇంకా కొనసాగుతుండడం దీనికి తోడు భారీవర్షాలు కురిసి నప్పుడల్లా వరద నీరుచేరి బురదమయంగా మారుతోంది. చిత్తడి చిత్తడిగా ఉండడంతో ప్రభుత్వఆసుపత్రి వెళ్లాలంటే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆసుపత్రి భవనానికి కనీసం వెళ్లేందుకు దారి సరిగ్గా లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● నియోజకవర్గంలోనే..

ప్రస్తుతం సిర్పూర్ నియోజకవర్గంలోనే సిర్పూర్ సామాజిక ఆసుపత్రి, కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయి. గతంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయి నుంచి ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రి ముందు వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి ఆవరణ విశాలంగా ఉండడంతో ఖాళీస్థలంతో పాటు రోగులకు అనుకూలంగా ఉంది. అయినాకూడా కేవలం ఆసుపత్రి మినహా వర్షంవస్తే చుట్టూ బురదమ యంగా మారుతోంది. అలాగే ఈ ఆసుపత్రి ఆవరణలోనే 108, 102, ఇతర అంబులెన్సులు, వాహనాలు పెడుతుంటారు. నిత్యంరద్దీగా ఉండే ఆసుపత్రి ముందు కనీసం రోడ్డు సరిగ్గా లేకపోవడంతో పాటు రాత్రిపూట అందకారంగా ఉంటోంది. కనీసం లైట్లు సరిగ్గా లేకపోవడంతో రోగులు, పోస్టుమార్టం కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు పాదచారులు, రోగులు బురదలో జారిపడి స్వల్ప గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రి వెళ్లేదారిలో గుంతలు పూడ్చి బురదమయంగా మారకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు వ్యక్తి ఆత్మహత్య


ప్రభాకర్(ఫైల్)

తాండూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి ప్రభాకర్ (64) అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్ అతిగా మద్యం తాగడానికి అలవాటు పడడంతో కుటుంబీకులు అతడిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గురువారం ఉదయం స్థానిక చెరువులో పడి ఆత్మహత్యచేసుకున్నాడు. ప్రభాకర్‌కు భార్య రాజేశ్వరి, ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శ్రీనివాస్(ఫైల్)

హాజీపూర్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కల్ల జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంతెన శ్రీనివాస్(49)అనే వ్యక్తి మృతి చెందాడు. శ్రీనివాస్ స్థానికంగా పాల వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం కిరణ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు అతి వేగంతో వచ్చి శ్రీనివాస్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య కవిత, కూతురు హరిని, కూమారుడు హర్షిత్ ఉన్నారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ పేర్కొన్నారు.

గోల్డ్‌లోన్ బాధితుల ఆందోళన

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలోని ఎస్‌బీఐ 2 బ్యాంకు ముందు గురువారం గోల్డ్‌లోన్ బాధితులు ఆందోళన చేపట్టారు. తాముతాకట్టు పెట్టిన బంగారం తమకు వెంటనే అందజేయాలని డిమాండ్‌చేస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మేనేజర్, క్యాషియర్ కలిసి బ్యాంకులో అవకతవకలకు పాల్పడితే తమను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారులను నిలదీశారు. చోరీకి గురైన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ వాటిని తమకు ఎందుకు అందించడం లేదని ఆగ్రహంవ్యక్తం చేశారు. గోల్డ్ లోన్ డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. బతుకమమ, దసరా పండగలకు ఆభరణాలు లేక ఎంతో మంది ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి పండగ లోగా తమ బంగారం తమకు ఇవ్వాలని లేకుంటే బ్యాంకు ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. బ్యాంకులో జరిగిన చోరీ కేసు విచారణలో ఉన్నందున కొంత జాప్యం జరుగుతోం దని, సంయమనం పాటించాలని బ్యాంకు అధికారులు నచ్చజెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

యువకుడికి పాము కాటు


ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

కౌటాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలెపల్లి గ్రామ శివారులో గురువా రం మధ్యాహ్నం పత్తి చేనులో పని చేస్తున్న వీర్దండి గ్రామానికి చెందిన డోంగ్రె మారుతి అనే యువకుడిని పాము కాటు వేసింది. గమనించిన రైతులు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. 108 పైలట్ సుభాష్, ఈఎంటీ విజయ్ వెంటనే బాలెపల్లి గ్రామానికి చేరుకుని మారుతికి ప్రథమ చికిత్స చేసి కౌటాల పీహెచ్‌సీకి తరలించారు. కౌటాల పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. మారుతికి ప్రాణపాయం ఏం లేదని వైద్యులు తెలిపారు.

రేషన్ దుకాణం తనిఖీ

సిర్పూర్(టి), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిగాం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, సిర్పూర్(టి) జీపీవో జ్యోతేశ్వర్ తనిఖీ చేశారు. దుకాణంలో 3.98 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని దుర్వినియోగం చేసిన సదరు డీలర్‌పై 6(ఎ) కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగి సేవలు ప్రశంసనీయం

కాగజ్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగి సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘ నాయకుడు ప్రహ్లాద్ మృతికికాగజ్‌నగర్ మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సంతాప కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల కోసం ఎనలేని కృషి చేసిన ప్రహ్లాద్ అకాల మరణం బాధకరమైన విషయమ న్నారు. ఆయన ఆశయాల సాధన కోసం అంతా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి


నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్థులు

ఆసిఫాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి అంకుశాపూర్, బాబాపూర్ గ్రామాల మీదుగా మోవాడకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.అంకుశాపూర్ గ్రామ సమీపంలో రోడ్డు దుస్థితిపై గురువారం రాస్తారోకో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ రోడ్డు గుంతల మయంగా మారిందని చెప్పారు. నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీతోనే బీసీలకు అన్యాయం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ వైఖరీతోనే బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 9పై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడంతో రాష్ట్రంలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో కలిసి బీసీలకు మోసం చేశారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ ఆరు నెలలుగా ఈ జీవోకు ఎందుకు ఆమోదం తెలుపలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్ మీద అక్రమ కేసులు పెట్టడానికి తెచ్చిన జీవోలు, రేవంత్‌రెడ్డి లాభం చేకూర్చే జీవోలు, కాళేశ్వరం కమిషన్‌కు సంబంధించి అన్ని అంశాలపై వెంటనే ఆమోదం ఎలా తెలిపారని ప్రశ్నించారు. బీసీలకు లాభం చేకూర్చే జీవోపై ఎందుకు ఆమోదం తెలుపలేదని చెప్పారు. తెలంగాణలో బీసీలంతా ఓట్లేసి గెలిపించిన 8 మంది బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీసీలకు న్యాయం చేసే బిల్లువిషయంలో ఎందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకరావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతా తెలిసి కోర్టులో విచారణ జరుగుతుండగా, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉన్నదని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, సీనియర్ ఉద్యమ కారుడు కొంగ సత్యనారాయణ, సలీం, మినాజ్, గోలేం వెంకటేష్, షాకీర్, పోశం, అతి యాబాను లహెంచు తదితరులు పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యం

గోదావరిఖని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బొగ్గు తీసేక్రమంలో రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి జీఎం (సీపీ, పీ) ఏ మనోహర్ అన్నారు. జీడీకే ఓసీపీ-5ని గురువారం సందర్శించి ఉత్పత్తి, ఉత్పదకత వివ రాలను అడిగి తెలుసుకున్నారు. ఓసీపీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. బొగ్గు తీసేక్రమంలో రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. బొగ్గు నాణ్యతను పెంపొందించుకోవడానికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, ఏరియా ఇంజినీర్ రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ డీ రమేశ్, గని మేనేజర్ అనిల్ గబాలే, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఓటూ జీఎం అధ్యక్షతన స్ట్రక్చర్ సమావేశం

గోదావరిఖని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులతో, ఆర్‌జీ-1 వివిధ విభాగాల విభాగాల అధికారులతో ఎస్‌ఓటూ జీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన గురువారం స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. పైవింక్లయిన్ ఏరియాలో ఉన్న సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను రిపేర్ చేసి నడపాలని, లేకపోతే కొంతమంది రాజకీయ నాయకులు ఆక్రమించే అవకాశం ఉందని గుర్తింపు సంఘం నాయకులు అన్నారు. జీడీకే 11ఇంక్లైన్‌కు సీసీ రోడ్డు నిర్మించాలన్నారు. పవర్‌హౌస్ కాలనీ, జీఎం కాలనీ, గాంధీనగర్ కాలనీలలో చెత్త రోడ్లమీద పోస్తున్నందున కుండీలు పెద్దగా కట్టివ్వాలని అన్నారు. చెత్త బయటకు రాకుండా ఉండేవిధంగా ఉండాలన్నారు. యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు 190 మస్టర్లు మూడు సంవత్సరాలు లేకున్నా కూడా అర్హత ఇవ్వాలన్నారు. యాక్టింగ్ చేస్తున్న బీసీ, ఓసీలకు చెందిన కార్మికులకు యాక్టింగ్ చేస్తున్న వారికి 150 యాక్టింగ్ మస్టర్‌లను 100కు తగ్గించాలని కోరారు. ఎస్‌సీ, ఎస్‌టీలకు 60 యాక్టింగ్ మస్టర్లకు తగ్గించి ఇవ్వాలన్నారు. దీంతో చాలామంది కార్మికులకు ప్రమోషన్స్ వచ్చే అర్హత వస్తుందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, పర్సన ల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏజీఎం (ఐఈడీ) అంజనేయులు, ఏజెంట్ రమేష్, అధికారులు బీమా, జితేందర్ సింగ్, వరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సొంతింటి పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దీపావళి నుంచి కార్మికులకు సొంతింటి పథకం అమలుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఏరియా ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా స్వీట్ బాక్సులు పంపిణీ చేసేవారన్నారు. కరోనా సందర్భంగా వాటిని నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. యాజమాన్యం స్పందించి స్వీట్ బాక్సులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల సందర్భంగా డిమాండ్లలో ముఖ్యమైన సొంతింటి పథకం, అలవెన్సులపై ఆదాయపు పన్ను మినహాయింపు దీపావళి కానుకగా వెంటనే అందించాలని కోరారు. సమావేశంలో ఐకే 1ఏ పిట్ కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు నిర్వహణపై సందేహాలు


మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతికి మూల స్తంభాలైన సింగరేణి ఉద్యోగులకు సంబంధించి మెడికల్ బోర్డు నిర్వహిస్తారా లేదా అని అనేక సందేహాలు నెలకొన్నాయని దీనిపై గుర్తింపుప్రతినిధ్య సంఘాలు నోరు మెదపడం లేదని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి అన్నారు. స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ లాభాల వాటా చెల్లింపులో కూడా సింగరేణి ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగినా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మాట్లాడలేదన్నారు. చాలా మంది కార్మికులు అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పారు. వీరికి ఒకే ఒక్క మార్గం మెడికల్ బోర్డు అని అన్నారు. ఇది లేకుండా పోతే వారి గతేమిటని ప్రశ్నించారు. అనారోగ్యంతో తాత్కాలిక అన్‌ఫిట్‌తో ఉన్న కార్మికులకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుర్తింపు సంఘం మాత్రం ఇవేమి పట్టించుకోకుండా చందాల వసూళ్లలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో మెడికల్ బోర్డుకు సంబంధించి సింగరేణి సీఎండీని త్వరలోనే కలుస్తామని తెలిపారు. మెడికల్ బోర్డు కోసం అవసరమైతే ఆందోళనలు చేస్తామని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి తమ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏరియా కార్యదర్శి సుదర్శన్

మందమర్రిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వాలీబాల్ క్రీడాకారులు కోల్ ఇండియాలో పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ అన్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో గురువారం ఏరియా వార్షిక క్రీడల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలకు హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది వయస్సు మీద పడిని వారెంచుకున్న క్రీడల్లో రాణిస్తున్నారని , యువ కార్మికులు కూడా రాణించాలన్నారు. క్రీడలను నిరంతరం సాధన చేయాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు తమయూనియన్ అండగా ఉం టుందని తెలిపారు. కార్యక్రమంలో క్రీడల సెక్రటరీ కార్తీక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శించి.. సమస్యలు తెలుసుకుని..

గోదావరిఖని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ సలహాదారు (ఫారెస్ట్రీ) పర్గైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) కోల్ మూవ్ మెంట్ బొగ్గు రవాణా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ వెంకన్న జాదవ్ గురువారం ఆర్‌జీ-1 ఏరియాను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ స్వాగతం పలికారు. మొదట జీడీకే1,3 ఇంక్లైన్ గనిని సందర్శించి గని వద్ద సర్ఫేస్ హాలర్, బంకర్, మ్యాన్ వే దారి, బొగ్గు నాణ్యత, బొగ్గు రవాణా గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్గైన్, వెంకన్న జాదవ్ ఆర్‌జీ-1 సెంట్రల్ నర్సరిని సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి ద్వారా విరివిగా మొక్క లను నాటడం ఒక గొప్ప విషయమన్నారు. అనంతరం ఏరియా హాస్పిటల్‌ను సందర్శించి హాస్పిటల్‌లో అవుట్ పెషంట్స్, ఇన్ పెషంట్స్ వివరాలు, హాస్పిటల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో కార్డియాలజీ నిర్మాణ దశలో ఉన్నాదానిని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో వార్డులను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వివ రాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, రామగుండం రీజియన్ క్వాలిటీ జీఎం సూజాయి మజుందర్, 1గ్రూప్ ఏజంట్ ఎల్ రమేష్, ఏరియా హాస్పిటల్ ఏసీఎంఓ అంబిక, డీజీఎం(ఫారెస్ట్) బానోత్ కర్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు వద్ద రసాయనిక మందుల డబ్బాలు

కాసిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కాసిపేట గోండుగూడ లోని చేతి పంపు వద్ద క్రిమిసంహారక రసాయనిక మందుల డబ్బాలను గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు. రహదారి పక్కన ఉన్న చేతి పంపు వద్ద రసాయన డబ్బాలు పడేయడంతో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలు, ఇతరులు రసాయన డబ్బాలను చేతులతో పట్టుకుని తర్వాత నీరు తాగితే ప్రమాదం పొంచి ఉంది. రసాయన డబ్బాలను ఊరికి దూరంగా పడేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. చేతి పంపు వద్ద నిర్లక్ష్యంగా రసాయన డబ్బాలు పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాసిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి నాయకపుగూడ గ్రామ శివారులోని సుద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కాసిపేట ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఐదు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ వాగులో పడి మృతిచెందినట్లు ఉన్నాడని తెలిపారు. వయస్సు అందాజా 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. పొడవు 5 పీట్ల 6 ఇంచులు, శరీరంపై నీలం రంగుతో కూడిన డబ్బాలు గల ఫుల్‌హ్యాండ్స్ షర్టు ఉందన్నారు. మృతుడి కుడి చేతికి కడియాలు ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 87126-56571కు సంప్రదించాలన్నారు. పెద్దనపల్లి పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

దండేపల్లి అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల ప్రింట్ మీడియా క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా గురువారం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బిల్యాగూడెం ఆదివాసి గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శు రవిగౌడ్, రాజన్న, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజన్న, కోశాధికారి వెంకటేష్, ప్రచార కార్యదర్శి సత్యం, పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

భీమారం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు అందరు సహకరించాలని తహసీల్దార్ సదానందం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఒక జడ్పీటీసీ, 5 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

పెట్రోల్ బంక్‌లు నిబంధనలు పాటించాలి

జైపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం పెట్రోలు బంక్‌లు నిర్వహించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వనజా రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జైపూర్, నర్వా, ఇందారం గ్రామాల్లోని పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. పెట్రోలు బంకుల యాజమాన్యాలు కల్పిస్తున్న సౌకర్యాలు, ఫ్రీ ఎయిర్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్‌లు తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్‌ఐ తిరుపతి, జీపీవో నవీన్‌రాజు ఉన్నారు.

దగ్గు మందా..జాగ్రత్త

రెండేళ్లలోపు చిన్నారులకు నిషేధం అంటున్న వైద్యులు



- తాజా ఘటనతో అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ
- తల్లిదండ్రులకు అవగాహన అవసరం

మంచిర్యాల క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధుల ముప్పు ఎక్కువైంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలకు దగ్గు మందులు ఇవ్వడంలో తల్లిదండ్రులు ఆచితూచి వ్యవహరించాలి. తాజాగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కోల్డ్ రిఫ్ దగ్గు మందువాడడం వల్ల పదుల సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడ్డట్లు వైద్యులు చెబుతున్నారు. దీనిపై ఆరోగ్యశాఖ దర్యాప్తు జరుపుతోంది. ఈ ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ఇప్పటికే కోల్డ్ రిఫ్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఔషధ నియంత్రణ విభాగం (డీసీఏ) ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సిరప్‌ల స్టాక్‌ను గుర్తించేందుకు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఇంకో వైపు ప్రజా ఆరోగ్యవిభాగం దగ్గుమందు వాడకంపై ప్రజలకు పలుసూచనలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో దగ్గు, జలుబు వచ్చినప్పుడు తగిన నివారణ చర్యలతోనే కట్టడి చేయ వచ్చని, వెంటనే తగ్గిపోవాలని దగ్గు సిరప్‌లను వాడితే అవి చిన్నారుల ప్రాణాలకే ప్రమాదమని ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. కొందరు నేరుగా మెడికల్ దుకాణానికి వెళ్లి ఫార్మాసిస్టు సలహాలతో సిరప్‌లు వాడడంవల్ల చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో వైద్యులు రాసిన మందులు అందుబాటులో లేకపోవడంతో అదే ఫార్ములాతో వేరొక సిరప్ ఇస్తామంటూ తల్లిదండ్రులకు టానిక్‌లను విక్రయించడంపై పిల్లల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని వైద్యులు చెబుతున్నారు. 2నుంచి 6ఏళ్లలోపు చిన్నారుల విషయంలో మందులువాడడం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా 2 సంవత్సరాలలోపు పిల్లలకు దగ్గు, జలుబు సిరప్‌లను పూర్తిగా నిషేధించాలని సూచిస్తున్నారు. నివారణ చర్యలతోనే కట్టడిచేయాలని హెచ్చరిస్తున్నారు.

వైద్యుల సూచనల మేరకే వాడాలి...



గతంలో ఆరేళ్లలోపు చిన్నారులకు దగ్గు టానిక్ లు వాడకూడదని ఆరోగ్య సంస్థలు సూచించాయి. మన వద్ద దాదాపు అదేవిధానం అనుసరిస్తున్నాం. పిల్లల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుల సూచనల మేరకే దగ్గు సిరప్‌లు వాడాలి. రెండేళ్లపై వయసు చిన్నారులకు తీవ్ర దగ్గు ఉంటే హనీ కలిగించని సిరప్‌లను కొద్ది మోతాదులో వైద్యులు సిపార్సు చేసిన మేరకు వాడవచ్చు. కొద్దిగా దగ్గుఉంటే భయపడాల్సిన అవసరం లేదు. నిద్రపట్టకపోతే సిట్రోజన్‌లాంటి మందుల ను వైద్యుల సలహాలతో వాడవచ్చు. కొన్నిరకాల దగ్గులతో ఊపిరితిత్తుల్లో కఫం నిండుతుంది. అలాంటి సందర్భాల్లో వివిధరకాల టానిక్‌లు వాడాల్సి ఉంటుంది. కొన్నిరకాల సిరప్‌లు విషంగా మారే ప్రమాదంఉంది. వీటిని దృష్టిలో ఉంచు కుని వైద్యుల సూచనలు తీసుకోవడం ఉత్తమం.

-డాక్టర్ రఘువంశి, పిల్లల వైద్య నిపుణులు

దగ్గు సిరప్ వాడకాన్ని నిలిపివేయాలి..

చిన్నపిల్లల్లో దగ్గు నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్‌రిప్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలి. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్ ఆదేశాల ప్రకారం కోల్‌రిప్ సిరప్ వినియోగించడం వెంటనే నిలిపివేయాలి. సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ఫార్మసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిలువలు ఉంటే వెంటనే సమాచారం అందించాలి. తమిళనాడు కాంచిపురం జిల్లాకు చెందిన శ్రేషన్ ఫార్మ, మే నెలలో తయారు చేసిన నం. ఎస్ఆర్ 13నుంచి వచ్చిన కోల్డ్‌సిరప్ వినియోగించడం వల్ల చిన్నపిల్లల్లో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందును నిషేధించామన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అనేకమంది సిరప్ వినియోగించడం వల్లనే అనారోగ్యపాలవడం వల్ల ఈ చర్యలు తీసుకున్నాం. సిరప్ నిలువలు ఉన్న వారు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నం. 1800599696లో వివరాలు అందించాలని వారు సూచించారు.

-డాక్టర్ అనిత, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి

ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడవద్దు



ఆర్థిక సహాయం అందజేస్తున్న బండి సదానందం యాదవ్

మందమర్రిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఇలా చేస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ తిరుపతి కుటుంబానికి గురువారం యూనియన్ నాయకులు సేకరించిన రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అధైర్యపడవద్దని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే యూనియన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. ఇటీవల కాలంలో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వాటికి పరిష్కార మార్గాలు ఉన్నాయని, అవనసరంగా డ్రైవర్లు నిరాశకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మొయ్య రాంబాబు, నాయకులు రాగిడి రాంరెడ్డి, రాజేష్, శివమణి, శ్రీను పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పోటీకి సీపీఐ సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సీపీఐ పార్టీ సిద్ధంగా ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా లోని అన్ని మండల కేంద్రాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లయ్య, లింగయ్య, కలీందర్‌ఖాన్, శ్రీనివాస్, పోచన్న, మహేందర్‌రెడ్డి సత్యనారాయణ, దవేదాస్ పాల్గొన్నారు.

శెట్‌పల్లి ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రం అందిస్తున్న అభ్యర్థి

కోటపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా మొదటి రోజైన గురువారం మండలంలోని శెట్‌పల్లి ఎంపీటీసీ స్థానానికి ఒక్క నామినేషన్ దాఖలైంది. ఈ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ చేయగా శెట్‌పల్లి గ్రామానికి చెందిన ఎండీ మలేకాబేగం తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పొగాకు వెంకటేశ్వర్లుకు అందించింది. మరో వైపు జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్ సమర్పించేందుకు వచ్చిన గట్టు లక్ష్మణ్‌గౌడ్ అనే అభ్యర్థి నామినేషన్ వేసేందుకు కేంద్రంలోకి వెళ్లగా హైకోర్టు స్టే విధించిందని సమాచారం అందడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

వేమనపల్లి: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మండలంలో 5 ఎంపీటీసీ స్థానాలకు, 1 జడ్పీటీసీ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో కుమారస్వామి పాల్గొన్నారు.

కాసిపేట : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నామినేషన్‌ల ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పురుషోత్తం నాయక్ ప్రారంభించారు. మొదటి రోజు 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగింది. మొదటి రోజు ఎవరు కూడా నామినేషన్‌లు దాఖలు చేయలేదు.

కోర్ట్ కాంప్లెక్స్‌కు మోక్షం..

(3వ పేజీ తరువాయి)

కూడా ఏర్పాటు కానుండటంతో ప్రజలకు రవాణా భారం తప్పనుంది. ఫ్యామిలీ కోర్టుతోపాటు జిల్లాకు భవిష్యత్తులో మరిన్ని కోర్టులు వచ్చే అవకాశం ఉంది.

ఐదు ఎకరాలు కేటాయింపు..

కోర్టు భవనాల సముదాయం ఏర్పాటు చేసేందుకు ప్రస్తుత కలెక్టరేట్ భవనం సమీపంలో ఐదు ఎకరాలను కేటాయించారు. మొదట జిల్లా కేంద్రంలోని భూదాన్ భూముల్లో 5.20 ఎకరాలను కేటాయిస్తూ మున్సిపల్ పాలకవర్గం తీర్మాణం చేసింది. ఆ స్థలం అనువుగా లేకపోవడంతో తిరిగి 2014లో జిల్లా కేంద్రంలోని రాముని చెరువు సమీపంలో సర్వే నెంబరు 406లో అధికారుల నివాసాల కోసం 1.34 ఎకరాలు, కోర్టుల సముదాయం కోసం 4.30 ఎకాలను కేటాయించారు. అయితే సదరు భూములు భవనాల నిర్మాణాలకు యోగ్యం కాదనే కారణంతో టెండర్లు కూడా పూర్తయ్యాక రద్దు చేశారు. అనంతరం 2017లో నస్పూర్ శివారు సర్వే నెంబరు 42లో ఐదెకరాలు కేటాయించగా, అందులోనే కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

రేపు శంకుస్థాపన..

జిల్లాకు కోర్టుల సముదాయ భవనం మంజూరు కావడంతో న్యాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ చేతుల మీదుగా వర్చువల్‌గా శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హైకోర్టు జడ్జి నగేష్ భీమపాకతోపాటు మంచిర్యాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వీరయ్య హాజరవుతుండగా, బార్ అసోసియేషన్ అధ్యక్షు డు బండవరం జగన్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణల నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దండేపల్లిఅక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దండేపల్లి మండలం లింగాపూర్ మెడల్ స్కూల్ చెందిన ఇంటర్ విద్యార్థి ఎమ్ రామ్ చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్, పీడీ మహేందర్‌లు తెలిపారు. అండర్ 19 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన రామ్‌చరణ్ మహబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో ఆడనున్నారు. ఈసందర్భంగా గురువారం ఆదర్శ కళాశాలోని విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత నేరస్థుల బైండోవర్

దండేపల్లి అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మండల పరిధిలోని పలువురు పాత నేరస్థులను బైండోవర్ చేసినట్లు ఎస్సై తహసీనోద్దీన్ తెలిపారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

గుంతలు పూడ్చారు.. బాధలు తీర్చారు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు

దండేపల్లి అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదం పొంచి ఉందని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం దండేపల్లి ఆంధ్రకాలని, మేదరిపేట బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల్లో కంకర మట్టి వేసి టాక్టర్ సాయంతో గుంతలను పూడ్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించారు. కొద్ది రోజులుగా ఈ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సమయాల్లో గుంతల్లో వాహనాలు అదుపుతప్పి కిందపడిన సంఘటనలు కూడా లేకపోలేదు. దీంతో అధికారుల తీరుపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సమస్యపై కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు గుంతలను పూడ్చారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రహదారిపై గుంతను పూడ్చిన అధికారులు

ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్, పోలీసులు

జైపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇందారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున డబ్బులు తీసుకువెళ్లే వారు తగిన ఆధారాలతో వెళ్లాలని సూచించారు. ఆధారాలు లేకపోతే డబ్బులను సీజ్ చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎస్‌ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

'సామాజిక తెలంగాణ కోసం ఉద్యమించాలి'

కాసిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రవాళ్ల పెత్తనం, దోపిడిని అరికట్టేందుకు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సామాజిక న్యాయం కొరవడిందని, అందుకే సామాజిక తెలంగాణ సాధన కోసం మళ్లీ ఉద్యమించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి జైపాల్‌సింగ్ అన్నారు. గురువారం సోమగూడెం తెలంగాణ ప్రజాఫ్రంట్16వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీరు, నిధులు, నియామకాల కోసం ప్రజలను చైతన్య పర్చి సబ్బండ వర్గాల ఆకాంక్ష మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలందరు సామాజిక తెలంగాణ కోసం మళ్లీ ఉద్య మించాలన్నారు. అనంతరం జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహాయకార్యదర్శి బోగె పోశం, నాయకులు జాడి చంద్రయ్య, ఆనంద్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల అందజేత

దండేపల్లి (లక్షెట్టిపేట) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్రోస్ ఎన్‌జీవో అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లలను వెంకట్రావుపేట వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ పంపిణీ చేశారు, గురువారం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టీబీ ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ సుదాకర్‌నాయక్ ఆదేశాల బ్రోస్ ఎన్‌జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పౌష్టిహాకారం కిట్లలను అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు తప్పకుండా తాము ఇచ్చే మందులు, పౌష్టికారం తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు సురేష్, వైద్య సిబ్బంది శోభ, మార్త, గఫూర్, వేణు, ఇస్తాక్ అహ్మద్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

తాండూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం తాండూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్‌ల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం విడుదల చేసిన కార్యచరణ ప్రకారం నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు.

మందమర్రిరూరల్ : మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్ ఉన్నారు.



తాండూర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

- బావుల వద్ద రక్షణ గోడలు కరువు
- హెచ్చరిక బోర్డులు లేక పొంచి ఉన్న ప్రమాదం



రెబ్బనపల్లి వెల్గనూర్ వెళ్లే రహదారి ఆనుకుని ఉన్న వ్యవసాయ బావి

దండేపల్లి అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బనపల్లి నుంచి వెల్గనూర్ వెళ్లే రోడ్డు, మేదరిపేట నుంచి గూడెం వరకు వెళ్లే రింగ్ రోడ్డు గ్రామాలైన కొండాపూర్, నంబాల రహదారిపై రోడ్డుపక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుకు అనుకోని ఉన్న ఈబావుల చుట్టు రక్షణ గోడలు లేవు. దీనికి తోడు బావుల వద్ద ముళ్లపొదలు, పిచ్చి మొక్కులు కమ్ముకుని ఉండడంతో అందులో మూలమాలుపులతో వాహనదారులు వీటిని గుర్తించేందుకు ఆస్కారం లేకుండా పోయింది. బావులకు రక్షణ గోడలు లేకపోవడం, కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా దారుల గుండా ప్రయాణించే వారు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇటివల మండలంలోని నంబాల గ్రామ సమీపంలో రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో యువకుడు వాహనం పై వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న వ్యవసాయ బావిలో పడటంతో యువకుడు మృతి చెందాడు. ఇప్పటికైన అధికారులు రెబ్బనపెల్లి నుంచి వెల్గనూర్ వెళ్లే రోడ్డు, ద్వారక నుంచి కొండాపూర్ గ్రామ శివారులో వాగు సమీపంలో పంట పొలాల వద్ద నంబాల గ్రామ సమీపంలో ఉన్న బావులను పర్యవేక్షించి క్షేత్రస్థాయిలో రహధారుల అనుకుని ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి రక్షణ గోడలను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం విడి మేదరిపేట నుంచి గూడెం రింగ్ రోడ్డు పక్కన పంట పొలాలకు ఆనుకుని ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.



కొండాపూర్ నుంచి ద్వారక వెళ్లే రోడ్డు పక్కన వ్యవసాయ బావి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు
3
శుక్రవారం 10 అక్టోబరు 2025

హైకోర్టు తీర్పుతో స్థానిక ఎన్నికలకు బ్రేక్
● అయోమయంలో ఆశావహులు 6

దగ్గు మందా..జాగ్రత్త
● రెండేళ్లలోపు చిన్నారులకు నిషేధం అంటున్న వైద్యులు
● తాజా ఘటనతో అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ 5

కోర్ట్ కాంప్లెక్స్‌కు మోక్షం



● భవన సముదాయానికి రేపు శంకుస్థాపన
● రూ. 81 కోట్లతో చేపట్టనున్న పనులు
● కలెక్టరేట్ సమీపంలో ఐదెకరాల స్థలం కేటాయింపు
● ఒకే సముదాయంలో అన్ని కోర్టుల ఏర్పాటు

కోర్టుల భవన సముదాయానికి నస్పూర్‌లో కేటాయించిన స్థలం

మంచిర్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కోర్టుల భవన సముదాయ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 'న్యాయ నిర్మాణ ప్లాన్' కింద రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాలకు కోర్టు కాంప్లెక్స్‌లకు గ్రీన్ సిగ్నల్ లభించగా, అందులో మంచిర్యాల జిల్లా సైతం ఉంది. ఈ మేరకు ఒక్కో జిల్లాకు 10+2 ప్రాతిపదికన రూ. 81 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ నాలుగు నెలల క్రితం జీఓ 597 జారీ చేసింది. కోర్టు కాంప్లెక్స్ నిర్మించడానికి టెండర్ పనులు సైతం ఇప్పటికే పూర్తయ్యాయి. మంచిర్యాలలో వివిధ కోర్టులు ఏర్పడి సుమారు 17 ఏళ్లు గడుస్తున్నా శాశ్వత భవనాలు లేక ఇంతకాలం ఇబ్బందులు తప్పలేదు. ఉట్నూరులో ఉన్న మొబైల్ కోర్టును 2005 ఏప్రిల్ 7న జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మార్పు చేస్తూ మంచిర్యాలకు తరలించగా, క్రమంగా కోర్టుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

తొమ్మిది కోర్టుల ద్వారా న్యాయ సేవలు...

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో వివిధ స్థాయిల్లోని తొమ్మిది కోర్టుల ద్వారా ప్రజలకు న్యాయ సేవలు అందుతున్నాయి. జిల్లా జడ్జి కోర్టుతోపాటు అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఒక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, మూడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, పోక్సో కోర్టు, జువైనల్ జస్టిస్ బోర్డ్ ద్వారా ప్రజలకు న్యాయ సేవలు పొందుతున్నారు. వీటితోపాటు బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేటలోనూ న్యాయ సేవలు అందుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలో ఉన్న కోర్టులన్నీ ప్రస్తుతం అద్దె భవనాల్లో వేర్వేరు ప్రదేశాల్లో కొనసాగుతుండటంతో కొంతమేర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కోర్టుల భవనాలు జాతీయ రహదారికి ఇరువైపులా ఉండటంతో రోడ్డు దాటే సమయంలో కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫ్యామిలీ కోర్టు మంజూరు...

జిల్లాకు ఫ్యామిలీ కోర్టు కూడా మంజూరైనట్లు తెలుస్తోంది. ఫ్యామిలీ కోర్టు మంజూరు కావడం వల్ల జిల్లా ప్రజలకు సేవలు మరింతగా చేరువ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో సగటున 300 వరకు కేసులు నడుస్తుండగా, ప్రస్తుతం ఆ విభాగానికి చెందిన వారంతా ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం ఫ్యామిలీ కోర్టు..

(తరువాయి 5లో)

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓట్ చోరీ అనే కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు నస్పూర్‌లోని 21వవార్డులో సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం వార్డు ఇన్‌చార్జి ధరణి మధుకర్ మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఓట్ చోరీతో అధికారంలోకి వచ్చిందని పేర్కొంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా తాము సంతకాలు సేకరించినట్లు చెప్పారు. వార్డులోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గోపతి తిరుపతి, యువజన కాంగ్రెస్ వార్డు అధ్యక్షుడు పిట్టలరవి, నాయకులు వాసాల శంకర్, ముత్యం, ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారస్థులు జీఎస్టీ విధానంపై అవగాహన కలిగి ఉండాలని, కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ప్రకారం క్రయ విక్రయాలు జరుపుకోవాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రమణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్పులపై వ్యాపారవర్గాలకు అవగాహన కల్పించారు. జీఎస్టీలో ప్రభుత్వం తీసుకువచ్చిన ముఖ్యమైన మార్పులను సంక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హమన్‌రాజ్, చాంబర్‌ఆఫ్ కామర్స్ టాక్స్ ప్రాక్టిషనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన మంత్రి వివేక్



ఖర్గేతో మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను డిల్లీలోని ఆయన నివాసంలో గురువారం రాత్రి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఖర్గే కొంత అనారోగ్యంతో బాధపడు తుండగా మంత్రి వివేక్ వెళ్లి కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల గురించి మంత్రి ఖర్గేకు వివరించారు. ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, బీసీ రిజర్వేషన్‌లపై చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. బీసీలంతా సంఘటితంగా ఉండి సాధించుకోవాలని మంత్రి తెలిపారు.

మహిళా రక్షణే షీటీం ధ్యేయం

● సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల, బాలికల రక్షణే షీటీం ధ్యేయమని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో రెండు షీటీం బృందాలు పని చేస్తున్నాయన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్న చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, టీ సేఫ్ యాప్, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ వాట్సప్ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్య పోస్టులు పెట్టిన వారిపై, సైబర్ నేరగాళ్లపై, సైబర్ షీటీం సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 8712659386 లేదా 100కు డయల్ చేయాలన్నారు. సెప్టెంబర్‌లో మొత్తం 65 ఫిర్యాదులు అందాయని, అందులో 59 కేసులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. మహిళలు, విద్యార్థులు ప్రతీ ఒక్కరు భయ పడకుండా సమస్యలు తలెత్తినప్పుడు షీటీంను సంప్రదించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచి వారికి న్యాయం చేస్తామని అన్నారు.

గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి

చెన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించేందుకు గొప్పలక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడ్‌లైన్స్ అనే అంశంపై జీకే పరీక్షను నిర్వహించగా ఈ కార్యక్రమానికి డీసీపీ అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం జీకే పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ దేవేందర్‌రావు, ఎంఈవో మోహన్, ప్రిన్సిపల్ పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ కిశోర్, అధ్యాపకుడు జగ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన డీసీపీ

స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, సీఐ దేవేందర్‌రావు, ఎంపీవో అజ్మత్ ఆలీ ఉన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక ఎన్ని కల నామినేషన్ కేంద్రాన్ని గురువారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు ఎంత మంది రావాలి, నామినేషన్ కేంద్రానికి బౌండరీ లైన్ తదితర విష యాలపై సూచనలు చేశారు. కేంద్రంలోనికి ఎవరిని అనుమతించకూడదని, కేంద్రం వద్ద బందోబస్తు ఉండాలని తది తర అంశాలను సీఐ, ఎస్ఐలకు వివరించారు.



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

పారుపల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

కోటపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణలో భాగంగా పారుపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించగా గురువారం మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వస్తున్న ఓ వాహనంలో భారీగా నగదును పట్టుకున్నారు. సిరొంచ నుంచి రాజేష్‌కుమార్ తలండి, వసంత్ అనే ఇద్దరు వ్యక్తులు కారులో నాగ్‌పూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలోని పారుపెల్లి వద్ద పోలీసు బృందాలు వాహనాన్ని ఆపి తనిఖీ చేశాయి. ఈ తనిఖీలో రూ.19.60లక్షల నగదు దొరికింది. నగదుకు సంబంధించిన సరైన ధృ వీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఎస్ఐ రాజేందర్‌లు తెలిపారు. సీజ్‌చేసిన నగదును జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించి ట్రెజరీలోజమ చేయనున్నట్లు తెలిపారు.



పట్టుకున్న నగదును స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్, ఎస్ఐ

పంచాయతీలకు సొంతభవనాలు కరువు

● అరకొర వసతుల మధ్య విధుల నిర్వహణ
● చాలా చోట్ల అసంపూర్తిగా దర్శనం

భీమిని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పల్లెలే దేశానికి పట్టు గొమ్మలు. అలాంటి వాటిల్లో సకల సౌకర్యాలు ఉన్నప్పుడే ప్రజలకు ఇబ్బందులు ఉండవు. అయితే చాలా చోట్ల గ్రామానికి సంబంధించిన అన్ని అంశాలను చర్చించే గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. కొన్ని దశాబ్ధాల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీని వల్ల గ్రామ పరిపాలన గాడిత ప్పుతోంది. ఓ వైపు ఈ పంచాయతీల పేరుతో అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తున్నామని అధికారులు చెబు తున్నా పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల కార్యదర్శులు, ప్రజలు నానా ఇబ్బంది లను ఎదుర్కొవాల్సి వస్తోంది.

అసంపూర్తి పనులు...

మండలంలో భీమిని, ఖర్జిభీంపూర్, కేస్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు అయి నప్పటికీ పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. పనులు చేసినా బిల్లులు రావని గుత్తేదారులు భయప డుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీ భవనా లు ఏళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

భీమిని మండలంలో 12 పంచాయతీలు ఉండగా వీటిలో ఒక మల్లీడీ, చిన్నగుడిపేట గ్రామ పంచాయతీలకు తప్ప ఎక్కడా కూడా స్వంత భవనాలు లేవు. మండల కేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భీమిని మండల కేంద్రంలో నూతన భవనం నిర్మిస్తున్నప్పటికీ నిర్మాణపు పనులు నత్త నడకన సాగుతోంది. దీంతో పాత ఇందిరమ్మ నమూనా శిథిలావస్థలో ఉన్న భవనంలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడమే కాకుండా కనీసం కార్యదర్శులు కూర్చునేందుకు వసతులు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో చెట్ల కింద, కూడళ్లలో గ్రామ సమావేశాలు, రైతు సమావేశా లు నిర్వహిస్తున్నారు. మండలంలో వీగాం, భీమిని, ఖర్జి భీంపూర్ గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు సకాలంలో పూర్తికాక నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్మీపూర్ గ్రామంలో సొంత భవనం నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



భీమినిలో అసంపూర్తి గ్రామ పంచాయతీ భవనము



వీగాంలో శిథిలావస్థలో జీపీ భవనము

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం...
-గంగ మోహన్, ఎంపీడీవో, భీమిని



మండలంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాల, భవనాలు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృ ష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్య లు తీసుకుంటాం.

విధులు సక్రమంగా నిర్వహించాలి

● డీసీపీ భాస్కర్



కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

కోటపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది సక్ర మంగా విధులు నిర్వహించాలని తద్వారా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్ పరిసరాలను, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికా ర్డులను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులను ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తీర్చాలని పోలీసులకు సూచించారు. బ్లూకోర్ట్, పెట్రోకార్ సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేప ట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పోలీసు అధికారులు తరుచూ పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ ప్రజలకు చట్టాల మీద, డయల్ 100, షీటీం, సైబర్‌నేరాలు, ట్రాఫిక్‌నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరకుండా విధులు నిర్వర్తించాలన్నారు. రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్ఐ రాజేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : కళ్లను జాగ్రత్తగా కా పాడుకోవాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఫర్ ఐ క్యాంప్‌లయన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దృష్టి లోపాలను నివారించే ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసే పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కళ్లు ఒక ముఖ్యమైన భాగం అని, కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. చిన్న పిల్లలకు మొబైల్‌ఫోన్‌లు ఇవ్వవద్దని తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ ముఖ్య ఉద్దేశ్యం అంధత్వ నివారణ అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, పిల్లల డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ శిల్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్తమాలజిస్టు శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య రాజ్య సమితి సమావేశాలకు హాజరైన ఎంపీ



వివిధ దేశాల ప్రతినిధులతో ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమా వేశాలకు (యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ) పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ముందుగా జాతిపిత గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ అహింస, శాంతిని పాటించిన గొప్పవ్యక్తి గాంధీ అని తెలిపారు. ఈ సమావేశాలకు హాజరు కావడం మర్చిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన పోరాటాలు గొప్పవని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వాతావరణ మార్పు శుద్ధి శక్తి వనరుల సమాన ప్రాప్తి, విద్య నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ శాంతి భద్రత గురించి మాట్లాడు తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా దేశాల ప్రతినిధులతో స్నేహం కూడా పెరుగుతుందన్నారు.

బీసీలను దగా చేసిన ప్రభుత్వం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : 42శాతం రిజర్వేషన్‌ల పేరిట స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను అవమానిస్తూ దగా చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మొదటి నుంచి మోసం చేస్తుందని, రిజర్వేషన్‌లపై హైకోర్టుస్టే విధించడంతో మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర బట్టబయలైందన్నారు. బీసీలను కావాలనే అవమానించారని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు కొండంత ఆశతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభించుకున్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్నారు. 42శాతం రిజర్వేషన్‌లను ప్రకటించడం ఎందుకుని ఆశలపల్లకిలో బీసీలను ఎగరినిచ్చి చట్టపరంగా అభాసుపాలైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో రిజర్వేషన్‌లు అమలుచేసి ఎన్నికలకు వెళ్లాలన్నారు. రిజర్వేషన్‌లను వారే ప్రకటించి వారే కేసులు వేశారని ద్వంద్వైఖరి అవ లంబిం చడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్‌లు బీసీలకు అమలుచేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటే శ్వర్‌రావు, వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్, రాకేష్, రమేష్ పాల్గొన్నారు.